భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 28.0



కేంద్ర మంత్రిగా వర్మ బాధ్యతల స్వీకరణ



భీమవరం టౌన్, జూన్ 18 : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం ఉదయం 11 గంటల 11 నిమిషాలకు న్యూఢిల్లీలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిం చారు. పురోహితులు వేలూరి వెంకట్రామయ్యశర్మ(జమిందార్), యామిజాల కృష్ణశర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తరలి వెళ్లారు. ఆయనను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయకర్, విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి, ఉండి జనసేన ఇన్‌చార్జ్ జత్తుగ నాగరాజు, కోరా రామ్మూర్తినాయుడు తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

గోదావరి నుంచి జిల్లాకు రక్షిత జలాలు

» ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, జూన్ 18 : 'మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడం, నీటిపారుదల శాఖకు మంత్రి కావడంతో బాధ్యత పెరిగింది. నియోజకవర్గ అభివృద్ధితోపాటు నా శాఖ ద్వారా రాష్ట్ర ప్రజలకు సేవలందిస్తాన'ని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఆయన పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకొల్లులో 90 శాతం అభివృద్ధి పనులు చేశాం. మిగిలిన పనులు ఇప్పుడు పూర్తి చేస్తాం. టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం. టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పిస్తాం. విజ్జేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలించే పైపులైన్‌కు రూ.250 కోట్లు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులు నోచుకోలేదు. ఈ పథకం పనులు పూర్తి చేసి, ప్రజలకు రక్షిత మంచి నీరు అందిస్తాం. అప్పట్లో రూ.12.60 కోట్లతో తలపెట్టిన వంద పడకల ప్రభుత్వాసుపత్రిపై దృష్టి పెట్టి పూర్తి చేస్తాం. దీనిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం' అని తెలిపారు. అలాగే వాతావరణం, ఆర్థిక పరిస్థితులు అన్నీ సహకరిస్తే పోలవరం ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు తీవ్ర ఆవేదన చెందారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

వారధి ఊహా చిత్రం



పట్టాలెక్కని వశిష్ఠ వారధి

» టెండర్లు మళ్లీ వాయిదా.. ఇప్పటికే పదిసార్లు

» రూ.490 కోట్ల పనులకు 2022లో సీఎం శంకుస్థాపన

» న్యాయపరమైన చిక్కుల పరిష్కారంలో జగన్ సర్కార్ విఫలం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లావాసుల చిరకాల వాంఛ వశిష్ఠ వారధి నిర్మాణం. శంకుస్థాపన జరిగి రెండేళ్లు గడిచినా.. టెండర్లు ఖరారు కావడం లేదు. గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు పదిసార్లు వాయిదా పడగా, ఈ నెల 12న తెరవాల్సిన టెండర్లు మళ్లీ వచ్చే నెల 11కి వాయిదా వేశారు. న్యాయపరమైన అంశాలే ఇందుకు కారణం కావడంతో గత ప్రభుత్వం దీని పరిష్కారానికి శ్రద్ధ చూపలేదు. శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుంది.

నరసాపురం, జూన్ 18 :

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ గత టీడీపీ హయాంలో ప్రతిపాదించిన రూట్‌ను పూర్తిగా మార్చేసింది. రాజుల్లంక వారధి నిర్మాణం చేపట్టి అక్కడి నుంచి సీతారాంపురం వద్ద 216 జాతీయ రహదారికి కలిపే విధంగా రూట్‌ను ఖరారుచేశారు. ఇప్పటికే నరసాపురం మండలం రాజుల్లంక, లక్ష్మణేశ్వరం, వైఎస్ పాలెం, రామన్నపాలెం గ్రామాల్లో భూసేకరణ పూర్తిచేశారు. చాలా మంది రైతులకు పరిహారం అందించారు. కోనసీమ జిల్లాలో భూసేకరణకు సంబంధించి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ కారణంగా 2022 నవంబరులో ఈ వారధి నిర్మాణానికి అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేసినా.. టెండర్లు ఖరారు కాలేదు. గత ఏడాది ఆగస్టులో ఎన్‌హెచ్ అధికారులు టెండర్లు పిలిచారు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్‌లో తెరవాలి. రైతులు కోర్టును ఆశ్రయించడంతో టెండర్ల తెరిచే అవకాశం లేకపోయింది. ఇటు ప్రభుత్వం కూడా రైతులతో చర్చించి రాజీ చేసే ప్రయత్నం చేయలేదు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రంలోను ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో రావడంతో ఈసారి వారధి పనులు పూర్తి అవుతాయన్న ధీమా ఉభయ గోదావరి జిల్లావాసుల్లో ఉంది. ఈ రహదారికి అనుమతించిన మంత్రి నితిన్ గడ్కరీ ప్రస్తుతం అదే మంత్రిగా కొనసాగుతున్నారు. దీంతో టెండర్లకు వున్న చిక్కులన్నీ త్వరితగతిన పరిష్కారమవుతాయన్న ధీమా నెలకొంది. అలాగే ఇటు నరసాపురం ఎంపీగా ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్నారు. ఇటు అమలాపురం ఎంపీగా బాలయోగి కుమారుడు హర్ష ఉన్నారు. వీరిద్దరూ ఈ ఎన్నికల్లో ఈ వారధి నిర్మాణంపై హామీలిచ్చారు. ఆ దిశగా కేంద్రాన్ని ఒప్పించి పనులను ఒక కొలిక్కి తీసుకువస్తారని గోదావరి వాసులు ఎదురుచూస్తున్నారు.

టీడీఆర్ బ్యాండ్



వైసీపీ నేత మాస్టర్ ప్లాన్

» పార్టీ గెలిస్తే కోట్ల దందాకు స్కెచ్

» ఓటమితో గాయబ్

» తాడేపల్లిగూడెంలో గజం స్థలం కనిష్ట విలువ రూ.13 వేలు

» మార్కెట్ ధర ఇంకా తక్కువ

» నాడు ఒత్తిళ్లకు తలూపి.. నేడు బలవుతున్న అధికారులు

వైసీపీ హయాంలో తాడేపల్లిగూడెంలో మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. పట్టణంలో 40 అడుగుల రహదారులు అధికంగా ఉండేలా ఆ పార్టీ నేత ప్లాన్ చేశారు. దీనికి ఇరు వైపులా స్థల యజమానుల నుంచి భూమిని సేకరించి టీడీఆర్ బాండ్‌లు జారీ చేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. వైసీపీ నేత సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. మళ్లీ అధికారంలోకి వస్తే దాదాపు రూ.2,000 కోట్ల విలువైన బాండ్‌ల జారీకి ప్రణాళికలు చేసుకున్నారు. తీరా ఎన్నికల్లో బోల్తా పడ్డారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే టీడీఆర్ బాండ్‌ల పేరిట కోట్లు కొల్లగొట్టేందుకు ఆ పార్టీ నేత పెద్ద ప్రణాళిక వేశారు. ఇందుకు అనుగుణంగా తాడేపల్లిగూడెంలో మాస్టర్ ప్లాన్‌లను తీర్చిదిద్దారు. వెంచర్లు, బడా వ్యాపారులు ఆస్తులు వున్న ప్రాంతంలో ఏరికోరి 40 అడుగుల రహదారులను మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు. రహదారికి అనుగుణంగా స్థలాలను సేకరించి మున్సిపాలిటీ బాండ్‌లు మంజూరు చేసేలా ముందస్తు కసరత్తు చేశారు. ఆ నేతకు అధికారులు పూర్తి సహకారం అందించారు. కొన్నింటికి ఎన్నికల ముందే బాండ్‌లు జారీ చేయ డంతో పెద్ద మొత్తంలో లబ్ధి పొందారు. కాని, తాడేపల్లిగూడెంతోపాటు, రాష్ట్రంలోనూ వైసీపీ ఓడి పోవడంతో ఆ నేతకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు అయ్యింది. సహకరించిన అధికారులపై ఇప్పుడు వేటు పడుతోంది. టీడీపీ నేతను ప్రసన్నం చేసుకుని మున్సిపాలిటీలోనే తిష్ట వేసేందుకు సదరు అధికారి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్నికల ముందే జిల్లా అధికారులు అతనిపై బదిలీ వేటు పడింది. ఇప్పుడు పూర్తిగా సొంత శాఖకు పంపించి వేశారు. ఇలా అధికారులు బలవుతున్నా రు. వైసీపీ నేతకు సహకరించి టీడీఆర్ బాండ్‌లు జారీ చేసిన అధికారులపైనా చర్యలు తీసుకునేలా కూటమి నాయకులు పావులు కదుపుతుండడంతో వారు బెంబేలెత్తిపోతున్నారు.

సొంత స్థలాన్ని మున్సిపాలిటీకి రాసిచ్చి

మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్‌లు పొందేందుకు మాస్టర్ ప్లాన్‌లోని తన సొంత స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. తాడేపల్లిగూడెంలో అయితే బయటకు పొక్కుతుందున్న ఉద్దేశంతో భీమవరంలో రిజిస్ట్రేషన్ చేశారు. అందుకు సంబంధించి టీడీఆర్ బాండ్‌లు జారీ అయితే విశాఖలో అమ్ముకోవడానికి మాట్లాడుకున్నారు. దీనిలోనే రూ.15 కోట్లు లబ్ధి చేకూరేది. టీడీఆర్ బాండ్‌ల విషయం టీడీపీ నేతకు తెలియడంతో అధికారులపై ఒత్తిడి తెచ్చారు. బాండ్‌లు జారీ చేస్తే ఎన్నికల అనంతరం చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో స్థానిక అధికారులు సంతకాలు చేయలేదు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నేత సీఎం పేషీలో కీలక అధికారిని కలిశారు. స్థానిక అధికారులు సంతకాలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇలా చేయలేమంటూ ఆ అధికారి చెప్పడంతో సదరు నేత వెనక్కు వచ్చేశారు. మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసిన స్థలానికి ఆనుకుని గతంలో మాస్టర్‌ప్లాన్ రహదారి లేదు. విమానాశ్రయ భూములు విస్తరించి ఉన్నాయి. కళాశాలలకు దారి ఉంది. కానీ మాస్టర్‌ప్లాన్‌లో దారి అంటూ లేదు. దీంతో పేదలకు ఇళ్లు ఇవ్వడానికి ఆ స్థలంలో ఏర్పాట్లు చేశారు. చివరకు రైతులు కోర్టుకు వెళ్లడంతో ఇళ్ల స్థలాల అప్పగింత నిలిచిపోయింది. ఆదేదారికి ఆనుకుని వైసీపీ నేత భూములు కొనుగోలు చేశారు. దీంతో మాస్టర్‌ప్లాన్‌లో రహదారి ఉండేలా చూసుకున్నారు. దాదాపు 60 అడుగులు ఉండేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. తన భూమికి ఆనుకుని రహదారి వెళ్లేలా అధికారులను ఒప్పించారు. మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. టీడీఆర్ బాండ్‌ల కోసం రహదారిలో పోయిన స్థలాన్ని మున్సిపాలిటీకి రాసిచ్చేశారు.

టీడీఆర్ బాండ్‌లు ఎప్పుడు ఇవ్వాలి

మున్సిపాలిటీల్లో రహదారులు విస్తరించాల్సి ఉన్నప్పుడు టీడీఆర్ బాండ్‌లు మంజూరుచేస్తారు. ఇందుకోసం ఒక గజానికి నాలుగు గజాలను టీడీఆర్ బాండ్ల రూపంలో జారీ చేస్తారు. వీటిని ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా స్థల యజమానులు అమ్ముకోవచ్చు. రిజిస్ట్రేషన్ విలువకు నాలుగు రెట్లు ఆదాయం వస్తుంది. ఇటు స్థల యజమానులకు మేలు చేకూరుతుంది. టీడీఆర్ బాండ్లను రహదారి విస్తరించినప్పుడే ఇవ్వాలి. అలా కాకుండా తాడేపల్లిగూడెంలో స్థల యజమానులు ఎప్పటిలాగే అనుభవిస్తున్నారు. వాటికి బాండ్లు పొందారు. సదరు స్థలంలో షాపులు ఉన్నాయి. వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇలా టీడీఆర్ బాండ్‌లు జారీ చేసి మున్సిపాలిటీ అభాసుపాలైంది. మున్ముందు బాండ్‌లు జారీకి ప్రణాళికలు చేశారు. తీరా ఫలితాలు తారుమారు కావడంతో ఫైళ్లు కదులుతున్నాయి. ఆ దిశగా కూటమి నేతలు పావులు కదపుతున్నారు.

రిజిస్ట్రేషన్ విలువ పెంపు

తాడేపల్లిగూడెం పట్టణంలో గజం రిజిస్ట్రేషన్ విలువ ఇప్పుడు కనిష్ఠంగా రూ.13 వేలకు చేరింది. వాస్తవానికి కొన్నిచోట్ల రూ.6 వేలు బహిరంగ మార్కెట్‌లో అమ్ముడు పోవడం లేదు. కానీ, టీడీఆర్ బాండ్‌లను దృష్టిలో ఉంచుకుని రిజిస్ట్రేషన్ విలువ పెంచేలా వైసీపీ నేత ఒత్తిడి చేశారు. ఆ మేరకు ధరలను పెంచినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్వోలకు కలెక్టర్ అభినందన



జేసీ ప్రవీణ్ ఆదిత్యకు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం టౌన్, జూన్ 18 : ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందనలు తెలిపారు. మంగళవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో ఆయన జిల్లాలోని ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశమై ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఏ విధమైన లోటుపాట్లకు తావు లేని విధంగా నిర్వహించినందుకు ఆర్వోలను కలెక్టర్ అభినందించారు. ఎన్నికలు ముగియడంతో పాలనాపరమైన టాస్క్‌లను చేపట్టాలని కోరారు. జేసీ, ఉండి ఆర్వో సి.వి.ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, భీమవరం ఆర్డీవో, ఆర్వో కె.శ్రీనివాసులు రాజు, తణుకు మున్సిపల్ కమిషనర్, ఆర్వో బి.వెంకట రమణ, తాడేపల్లిగూడెం ఆర్డీవో, ఆర్వో కె.చెన్నయ్య, కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టరు, పాలకొల్లు ఆర్వో బి.శివనారాయణ రెడ్డి, ఏపీ టూరిజం జేడీ, ఆచంట ఆర్వో వి.స్వామి నాయుడు తరపున తహసీల్దార్ ఐపీ శెట్టి, నరసాపురం ఆర్డీవో, ఆర్వో యం.అచ్యుత అంబరీష్ తరపున తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, కలెక్టరేట్ పరిపాలనాధికారి పి.పాపారావు, ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకులు చందన దుర్గప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం. సన్యాసిరావు తదితరులు కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

ఇంటర్ సెకండియర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 41.38 శాతం ఉత్తీర్ణత

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 18 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో జిల్లాకు 41.38 శాతం ఉత్తీర్ణత వచ్చింది. మే 24 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు జరిగిన ఈ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ కె.చంద్రశేఖరబాబు తెలిపారు. జిల్లాలో 94 కళాశాలలకు సంబంధించి 3,695 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,529 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 37 కళాశాలల్లో 406 మంది పరీక్షలు రాయగా 206 మంది ఉత్తీర్ణత సాధించగా 50.73 శాతం వచ్చింది. ఉత్తీర్ణులందరికీ ఈ నెల 30వ తేదీ నాటికి సంబంధిత కళాశాలల నుంచి పాస్ సర్టిఫికెట్లు అందజేస్తారు. రీ-వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించి, ఈ నెల 20 నుంచి 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాలకోడేరు, ఉండి మండలాల్లో ఫ్లెక్సీల వివాదం

-7లో

ఆక్వా.. ఆనందం

ఆక్వా రంగానికి పూర్వ వైభవం రానుంది. వైసీపీ హయాంలో పతనావస్థకు చేరుకున్న ఈ రంగాన్ని ఆదుకోవడానికి ఎన్నికల ముందు టీడీపీ కూటమి హామీలు ఇచ్చింది. జోన్‌తో నిమిత్తం లేకుండా యూనిట్ విద్యుత్ ఛార్జీని రూపాయిన్నరకు అమలు చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వం రావడంతో దీని అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నది. మరోవైపు రాయితీతో ఆక్వా పరికరాలను అందిస్తామని ఇచ్చిన హామీపైన కసరత్తు చేస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధోగతి పాలైన ఆక్వా రంగం ఇప్పుడు కోలుకోనుందని అంతా ఆశిస్తున్నారు.

- భీమవరం టౌన్



కూటమి ప్రభుత్వం రాకతో రైతుల హర్షం

» జగన్ పాలనలో ఐదేళ్లూ.. నష్టాల్లోనే రొయ్యల సాగు

» విద్యుత్ యూనిట్ చార్జీల సబ్సిడీ కుదింపు.. మరోవైపు భారీగా మేతల ధరల పెంపు

» నష్టాలతో జిల్లాలో తగ్గిన సాగు

» చంద్రబాబు రాకతో ఆక్వా రంగానికి పూర్వ వైభవం

• చంద్రబాబు రాకతో యూనిట్ తగ్గింపు

2014 సంవత్సరానికి కంటే ముందు ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.3.85 పైసలు వసూలు చేసేవారు. ఆ ఏడాది చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని రెండు రూపాయలకు తగ్గించారు. దీంతో జిల్లాలో రెండు లక్షల 50 వేల మంది రైతులు లబ్ధి పొందారు. అలాగే రెండున్నర లక్షల విలువైన 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉచితంగా ఇవ్వడంతో చిన్న, మధ్య తరగతి రైతులు ఆక్వా సాగుపై దృష్టి సారించారు. ఫలితంగా 2017-18లో ఆక్వా రంగం ద్వారా రాష్ట్రానికి అత్యధిక ఆదాయం జిల్లా నుంచి దాదాపు ఎనిమిది వేల కోట్లు లభించింది.

• జగన్ దెబ్బతో రైతులు విలవిల

2019 ఎన్నికల్లో ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కు అందజేస్తామని అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి రావడంతో దీనిని అమలుచేశారు. అయితే అనేక రకాల షరతులు విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆక్వా జోన్ పరిధిలోని ఐదు ఎకరాలకుపైగా వున్న రైతులకు విద్యుత్ సబ్సిడీని అందించలేదు. ఫలితంగా ఇది ఆక్వా రైతులను దెబ్బ తీసింది. రైతులు ఆందోళన చేయడంతో సర్వే చేయించారు. జోన్‌లో వున్న చెరువులు, జోన్ దాటివున్న చెరువులను సర్వే చేసినా రైతులకు న్యాయం జరగలేదు. చివరకు రైతుల వత్తిడి తట్టుకోలేక సబ్సిడీని పదెకరాల వరకు పెంచారు. అయినప్పటికీ 50 శాతానికి మించి రైతులకు లాభం కలగలేదు. వైసీపీ హయాంలో పేరుకే విద్యుత్ రాయితీ కల్పించారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ పేరుతో పక్షపాతం చూపించారు. దీంతో వేలాది మంది రైతులు నష్టపోయారు. రాయితీ పొందిన రైతులకు పెద్ద ప్రయోజనం కనిపించలేదు. బొగ్గు ధరలు, లోడు ధరలు యూనిట్‌కు పది రూపాయల వంతున వసూళ్లు చేశారు. పైకి మాత్రం యూనిట్ రూ.1.50 ఇస్తున్నామంటూ గొప్పలు చెప్పుకున్నారు. వాస్తవానికి ఇది రైతుల నడ్డి విరిచింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రూ.5 లక్షలకు పెంచేసింది. అందులోనూ రాయితీ ఇవ్వలేదు. మరోవైపు ధరలు పతనంతోపాటు ఎగుమతులు దారుణంగా పడిపోయాయి.

• మేత ధర భారీగా పెంపు

గత టీడీపీ ప్రభుత్వంలో టన్నుకు రూ.65 వేల నుంచి రూ.68 వేల మధ్య వున్న మేత ధర వైసీపీ ప్రభుత్వం రాగానే రూ.95 వేలకు పెంచింది. దీనిపై రైతులు గగ్గోలు పెట్టారు. అయినా తగ్గించలేదు. టెక్నాలజీ, పరికరాల ధరలు పెరిగి.. రొయ్యల ధరలు పడిపోయాయి. కౌంట్ ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని రైతులు కోరారు. 2022లో ధరల నియంత్రణ కోసం ఒక కమిటీ వేసింది. కనీసం 60 కౌంట్ రొయ్యి రూ.242 స్థిరంగా ఉండాలని ఆదేశించినా రూ.190 మించి ఉండలేదు. దీంతో రైతుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. చాలా మంది రైతులు సాగును వదిలేశారు. రైతులు నష్టంలో కూరుకుపోయి సాగును విరమించుకున్నారు. జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం సగానికి పడిపోయింది. 50 వేల ఎకరాల్లో సాగు చేయడం కష్టంగా మారింది. గతంలో రెండు లక్షల ఎకరాల్లో సాగు ఉండేది. నష్టాలు వస్తుండటంతో రైతులు సాగు నుంచి వైదొలుగుతున్నారు.

• చంద్రబాబు హామీతో

ఎన్నికల్లో పాలకొల్లు వచ్చిన చంద్రబాబు ఆక్వా రైతులకు వరాలు ప్రకటించారు. ఎటువంటి షరతులు లేకుండా రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తామని, మేతల ధర తగ్గిస్తామని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఉచితంగా అందించే పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీలిచ్చారు. నాణ్యమైన రొయ్యల పిల్లలను అందిస్తామని, ప్రభుత్వ హేచరీలు ఏర్పాటుకు భరోసా కల్పించి ఆక్వా రైతుల మద్దతును పొందగలిగారు.

• జిల్లాలో ఆక్వా రంగంపై ఆదాయం

జిల్లాలో భీమవరం, ఉండి, నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, గణపవరం, ఆకివీడు, కాళ్ళ తదితర మండలాలు పూర్తిగా ఆక్వా రంగంపైనే ఆధారపడుతున్నారు. గడిచిన ఐదేళ్లుగా ఆక్వా రంగం దెబ్బ తినడంతో ఆ ప్రభావం ఇతర రంగాలపై పడింది. వ్యాపారాలు మందగించాయి. అభివృద్ధి ఆగిపోయింది. ప్రభుత్వ ఆదాయం పడిపోయింది. ఉభయ గోదావరి జిల్లాల్లోనే రూ.10 వేల కోట్ల విలువైన సరుకును ఇతర దేశాలకు ఎగుమతి చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆక్వా సాగు గిట్టుబాటు కాకపోవడంతో లీజు తగ్గింది. రైతులు గతంలో చెరువులు లీజు తీసుకునేందుకు ఎగబడేవారు. ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. ఫలితంగా గతంలో లక్ష వరకు వున్న లీజు ఇప్పుడు రూ.60 వేలకు పడిపోయింది. ప్రస్తుతం ఆక్వా సాగు అంత గా లేదని చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం అందించే రాయితీలతో మళ్లీ పూర్వ వైభవం వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కేంద్రమంత్రి నిర్మలను కలిసిన కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు

కేంద్ర మంత్రి నిర్మలను కలిసిన ఎమ్మెల్యేలు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 18 : ఉమ్మడి పశ్చిమ జిల్లాకు చెందిన కేంద్ర ఉక్కు, గనుల సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో పాటు పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలాసీతా రామన్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ నియోజకవర్గాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరిమిలి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి

» జలవనరుల శాఖమంత్రి నిమ్మలకు రైతు సమితి నాయకుల వినతి

భీమవరంటౌన్, జూన్ 18 : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కాల్వల పూడికతీత, కాల్వల అభివృద్ధి తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు కార్యాచరణ సమితి నాయకులు కోరారు. మంగళవారం పాలకొల్లులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలసి వినతి పత్రం అందించి రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై మంత్రి రామానాయుడు స్పందిస్తూ తక్షణమే అవసరమైన చర్యలు తీసుకుంటామని, వచ్చే సీజన్ నాటికి ఎటువంటి సమస్యలు లేకుండా పూర్తిగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రామానాయుడును సత్కరించారు. కార్యక్రమంలో సమితి గౌరవాధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు, కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు, మంతెన కృష్ణంరాజు, నల్లం నాగేశ్వరరావు, భూపతిరాజు సత్యనారాయణరాజు, పీవీ గోపాలకృష్ణంరాజు, ఎంఎస్ఎన్ రాజు, కమలాకరశర్మ, దాట లక్ష్మీపతిరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, గోపి శెట్టి మురళీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

20,21న గురుకుల ప్రవేశానికి రాత పరీక్ష

నరసాపురం రూరల్; జూన్ 18: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని బీసీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 20, 21 తేదీల్లో రాత పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా కన్వీనర్ శైలజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చేరేందుకు మొత్తం 744 దరఖాస్తు వచ్చాయన్నారు. 6, 8 తరగతులకు జూన్ 20న, 21న 7, 9 తరగతులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు హాల్ టిక్కెట్లతో పరీక్షకు హాజరుకావాలన్నారు.

మా నివాసాలను తొలగించొద్దు

» కలెక్టర్‌ను వేడుకున్న పాలకోడేరు పంతొట్టి వాసులు



శ్మశానవాటిక విషయమై ఇరువర్గాల ఘర్షణ దృశ్యం

పాలకోడేరు, జూన్ 18:పాలకోడేరు శివారు పంతొట్టి వద్ద గృహాలను తొలగించి శ్మశానవాటిక ఏర్పాటు చేస్తున్నారని తమకు రక్షణ కల్పించాలని ఆ ప్రాంత వాసులు మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను వేడుకున్నారు. పాలకోడేరు శివారు పంతొట్టిలో సుమారు 20 కుటుంబాలు ఇరిగేషన్ పొరంబోకు స్థలంలో పూర్వం నుంచి నివాసం ఉంటున్నారు. వీరి గృహాలను చేర్చి కొంత దూరంలో ఎస్సీ, బీసీలకు చెందిన శ్మశానవాటిక ఉంది. కొంతమంది వ్యక్తులు ఇళ్ళ మధ్యలో నుంచి శ్మశానవాటికకు వెళ్ళేందుకు రహదారిని వేసి గృహాలను చేర్చి మృతదేహాలను పూడుస్తున్నారంటూ కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ స్పందించి రెవెన్యూ సిబ్బందికి ఆ వివాదాన్ని పరిష్కరించాలని సూచించడంతో మంగళవారం సాయంత్రం తహసీల్దార్ నాగార్జున, రెవెన్యూ సిబ్బంది వివాదా స్పద స్థలం వద్దకు వచ్చి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాలు వాదోపవాదాలు పడడంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని తెలియపరిచి వెళ్ళిపోయారు. ఈ మేరకు ప్రస్తుతం వివాదం సద్దుమణిగింది. అక్కడ నివాసం ఉంటున్న వారు మాత్రం తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

జగన్ చిత్రపటాలు తొలగించండి



ఆర్‌బీకేపై వున్న జగన్ చిత్రం

పాలకోడేరు, జూన్ 18: వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి కూటమి ప్రభుత్వం ఏర్పడినా ప్రభుత్వ కార్యాలయా లపై జగన్ చిత్రపటాలు ఇంకా ఉంచడం ఏమిటని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తు న్నారు. పాలకోడేరులోని రైతు భరోసా కేంద్రంపై వైఎస్ జగన్ చిత్రపటం ఉండడాన్ని గ్రామ టీడీపీ నాయకులు తప్పుపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా ప్రభుత్వ కార్యాలయాలపై జగన్ చిత్రపటాలు ఏమిటని వెంటనే తొలగించాలి అంటున్నారు. పాలకోడేరు ఆర్‌బీకేపై జగన్ చిత్రపటం ఉండడాన్ని వ్యవసాయాధికారి నారాయణరావును వివరణ కోరగా ఆ చిత్రపటాన్ని తీసేందుకు అధికారం లేదని ఆ చిత్రపటం కనిపించకుండా కాగితాన్ని అంటిస్తామని తెలిపారు.

చదువుకునే రోజులు పోయి చదువు"కొనే" రోజులు వచ్చాయి. బడి తలుపులు తీస్తున్న వేళ తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్ మొదలైంది. ప్రైవేటు స్కూళ్ళు, కార్పొరేట్ విద్యాసంస్థలలో పుస్తకాలు, ఫీజులు చూస్తుంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పిల్లల భవిష్యత్తే తమ భవిష్యత్తుగా భావించి అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. ఎల్‌కేజీ నుంచే ఫీజుల బాదుడు భారీగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

– నిడమర్రు



ఫీజుల మోత..



అడ్డదిడ్డంగా ఫీజులు పెంచేస్తూ.. ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్న ప్రైవేటు స్కూళ్లు

» అదనపు దోపిడీకి రూపాలెన్నో
» పుస్తకాలు, యూనిఫాం పేరుతో వసూళ్లు
» తల్లిదండ్రులపై చదువుల భారం

జూన్ నెల వస్తే ..

జూన్ నెల వచ్చిందంటే చాలు..తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బడి తలుపులు తెరిచే సమయానికి పిల్లలు చదువు కోసం వేలల్లో, లక్షల్లో సొమ్ములు చూసుకోవాల్సి పరిస్థితి దాపురించింది. తాడేపల్లిగూడెంకు చెందిన ఓ కార్పొరేట్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థికి హాస్టల్‌తో కలిపి లక్ష రూపాయలు చెల్లించాలని మెస్సేజ్ రావడంతో పేరెంట్స్ బెంబేలెత్తిపోతున్నారు. కనీసం ఫీజులు వాయిదా రూపంలో చెల్లించడానికి కూడా ససేమిరా అంటుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక పేరున్న ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలంటే ఆరు నుంచి పదో తరగతి వరకు తరగతిని బట్టి ఒక్కో విద్యార్థికి రూ.50 వేల నుంచి 80 వేల వరకు ఫీజుల రూపంలో అవుతుంది. దీనికి ట్రాన్స్‌పోర్టు ఫీజు అదనం.

అడ్డదిడ్డంగా ఫీజులు

గత సంవత్సరం 4వ తరగతి చదివే పిల్లవాడికి ఓ కార్పొరేట్ స్కూల్‌లో బుక్స్ ఫీజు రూ.4 వేలు అయితే నేడు అదే పిల్లవాడికి 5వ తరగతి బుక్స్ ఫీజు రూ.10 వేలు వేయడంతో పేరెంట్స్ గగ్గోలు పెడుతున్నారు. ఐదో తరగతి పిల్లవాడికి అంత ఖరీదైన బుక్స్ ఏముంటాయని ప్రశ్నిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇలా ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుకొంటూ పోతే ఎలా చదివించు కోవాలని ఓ మధ్య తరగతి కుటుంబం ఆవేదన చెందుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న చదువుల భారం తగ్గించేందుకు గత ప్రభుత్వం కొంత ప్రయత్నం చేసి పేరెంట్స్ కమిటీ సభ్యులతో చర్చించి ఆరోగ్యకరమైన, హర్షనీయమైన ఫీజుల విధానం ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయత్నిస్తే సఫలం కాలేదు. ప్రైవేటు స్కూల్స్ యజమాన్యాలు ప్రభుత్వ చర్యలు అమలు చేయనీయలేదు. పేరెంట్స్ కూడా ప్రైవేటు స్కూల్స్ మాయలో పడిపోతున్నారు. ఇంగ్లీషు మీడియం పేరుతో సరైన విద్యార్హతలు లేని ట్యూటర్లతో బోధన చేస్తున్నప్పటికీ అక్కడ ఏదో చేప్పేస్తారు అనే అపోహతో అధిక ఫీజులు చెల్లించి మరీ ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో చేర్పించి అప్పులు పాలవుతున్నారు. కొత్త ప్రభుత్వం హయాంలోనైనా ఫీజుల భారం తగ్గుతుందని పేరెంట్స్ ఆశతో ఎదురుచూస్తున్నారు.

దారుణంగా పెంచేస్తున్నారు



నా ఇద్దరు పిల్లల చదువు కోసం ప్రతి సంవత్సరం లక్షల్లో ఖర్చవుతోంది. పిల్లలకు చదువును మించిన ఆస్తి ఇంకొకటి లేదని భావించి గణపవరం సమీపంలో కార్పొరేట్ స్కూల్‌లో జాయిన్ చేశాను. స్కూల్ ఫీజులు ప్రతి ఏటా దారుణంగా పెంచేస్తున్నారు. గత సంవత్సరానికి ఈ ఏడాదికి బుక్స్ ఫీజు డబుల్ చేశారు. కొత్త ప్రభుత్వం పత్యేక శ్రద్ధ తీసుకొని తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలి.

– తెలగారెడ్డి వెంకట సతీష్, పేరెంట్, గణపవరం

అధికంగా వసూలు చేస్తే ఫోన్ చేయండి



అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలతో ఎప్పటికప్పుడు చర్చలు జరిపి అందరికీ ఆమోద యోగ్యమైన ఫీజులు నిర్ణయించాలని సూచనలు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టయితే నా సెల్ నెంబర్ 98499 09105కు ఫిర్యాదు చేయండి. తక్షణం చర్యలు తీసుకుంటా..

ఎస్.అబ్రహం, డీఈవో, ఏలూరు జిల్లా

టేకు చెక్కపై 'రామాయణం'

» అబ్బురపరుస్తున్న కనకలింగ వీరబ్రహ్మం చెక్కిన చిత్రాలు
» తలుపులపై దేవుడి బొమ్మలు, సిమెంట్ దిమ్మెలపై శిల్పాలు

చింతలపూడి, జూన్ 18 : ఆధునిక యుగంలో యంత్రాలు.. టెక్నాలజీ వచ్చినా చేతివృత్తుల కళలు అంతరించిపోకూడదు. కళలు, కళాకారులు, శిల్పులు తమ నైపుణ్యం చాటిన చోట రాజ్యాలు కళకళలాడేవని చెబుతుంటారు. అంతటి అద్భుతమైన రామయణ ఇతివృత్త చిత్రాలను టేకు చెక్కపై చెక్కిన కనకలింగ వీరబ్రహ్మం తన కళానైపుణ్యంతో అబ్బురపరిచారు. ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన మందగుల కనకలింగ వీరబ్రహ్మం ఎలక్ట్రీషియన్‌గా పదేళ్ళు పనిచేసి 2001లో పాత యర్రవరపు శేషయ్య స్ఫూర్తితో తలుపులపై దేవుడి బొమ్మలు చెక్కడం, సిమెంట్ దిమ్మెలపై శిల్పాలు చెక్కడంలో ఆరితేరారు. ఇప్పుడు కొత్తగా రామాయణ ఇతివృత్తం గల పాత్రలు, వాటి విశిష్టతలను తెలుపుతూ రెండు అడుగుల మందం గల టేకుచెక్కపై 20 అంగుళాల వెడల్పు, 30 అంగుళాల ఎత్తుగల చెక్కపై మూడు నెలల సమయంలో రామాయణ ఇతివృత్తం చెక్కారు.

గతంలో పురస్కారాలు

వీరబ్రహ్మం గతంలో పలు పురస్కారాలు అందుకున్నారు. 2015-16లో శిల్పిగా ఉగాది పురస్కారం, 2024 ఢిల్లీకి చెందిన విశ్వకర్మ కమ్యూనిటీ నుంచి లెజెండ్ అవార్డు పొందటం, ఇప్పుడు ఈ కళాఖండాన్ని కేంద్రశాఖకు అవార్డు నిమిత్తం పంపించానని తెలిపారు.

తాత శేషయ్యే స్ఫూర్తి

తనకు తన తాత యర్రవరపు శేషయ్యే ఈ కళాఖండంలో నైపుణ్యం రావడానికి కారణమని వీరబ్రహ్మం తెలిపారు. తన తాత 1936లో రైలు ఇంజన్ చెక్కిన బొమ్మ తయారు చేశారు. బ్రిటీష్ ప్రభుత్వం అప్పుడు అతడికి గోల్డ్‌మెడల్ అందజేసిందని ఆయన పంచలోహ విగ్రహాలు తయారు చేయడం, నగలు పెట్టడం వంటివి చేసేవారని తెలిపారు. ఆయన స్ఫూర్తి తనకు ఇప్పుడు ఈ విధమైన శిల్పకళకు ఉపయోగపడిందని చెప్తున్నారు. హస్త కళలు అంతరించి పోకుండా ఉండేందుకు ఉత్సాహ యువకులు ముందుకు వస్తే శిక్షణ ఇవ్వడానికి సిద్ధమని ఇటువంటి కళలు అంతరించిపోకూడదని పేర్కొన్నారు. వివరాలకు 94908 83646 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.







↑ డిజైన్ చేసుకుంటున్న చిత్రం

చెక్కపై రామాయణం ఇతివృత్తం.. మందగుల కనకలింగ వీరబ్రహ్మం

నిడమర్రు నుంచి ఫత్తేపురం రోడ్డుకు జనసేన నేత సొంత నిధులతో మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న వాసు

నిడమర్రు జూన్ 18 :తమ గ్రామానికి వెళ్లే రహదారికి తానే సొంతంగా మరమ్మతులు చేయించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు ఓ యువకుడు. నిడమర్రు నుంచి ఫత్తేపురం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల రహదారి పెద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా స్పందన లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో శాశ్వత రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలోపు ప్రభుత్వానికి అండగా పెదనింద్రకొలనుకు చెందిన జనసేన నాయకుడు పత్సాకుల వాసు స్పందించి సుమారు రూ.లక్ష అంచనాతో ఎక్స్‌కవేటర్ సాయంతో కంకరతో గోతులను పూడ్చడానికి ముందుకు వచ్చారు. సొంత నిధులతో మరమ్మతులు చేయడం పట్ల గ్రామస్థులు, పలువురు అభినందించారు.

ఉపాధి కూలీకి పాము కాటు

» తణుకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స.. నిలకడగా పరిస్థితి



సిద్ధాంతం పీహెచ్‌సీలో బాధితురాలిని పరామర్శిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్ దొర

పెనుగొండ, జూన్ 18 : పెనుగొండ మండలం దేవ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న గుడాల లలిత అనే మహిళను విషపూరితమైన పాము కాటేసింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. దేవ గ్రామ శివారు పెళ్ళికూతురమ్మ చెరువు వద్ద మంగళవారం పంట కాల్వలో సుమారు 40 మంది ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. పని ముగించుకునే క్రమంలో లలితను తాచుపాము కాటు వేసిందన్నారు. సత్వరమే సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకురావడంతో ఆమెకు ప్రథమ చికిత్స చేశారు. ఎంపీడీవో ఎస్. శ్రీనివాస దొర, సాంకేతిక నిపుణుడు శంకర్ వచ్చి ఆమెను పరామర్శించారు. లలితను మెరుగైన చికిత్స కోసం పెనుగొండ సీహెచ్‌సీకి తరలించగా అక్కడ నుంచి తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు బంధువులు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

మోటారుసైకిల్ దొంగతనంపై కేసు

పెదపాడు, జూన్ 18 : పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ పరిసరాల్లో రోడ్డు పక్కన నిలిపి వుంచిన బుల్లెట్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడని ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం జరిగింది. వివరాలివి.. కలపర్రు టోల్ గేట్ పరిసరాల్లో రోడ్డు పక్కన నిలిపి వుంచిన బుల్లెట్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడని దెందులూరు మండలం సోమవరప్పాడుకు చెందిన వెంకన్నబాబు ఫిర్యాదు చేశారు. మరమ్మతులకు గురై టోల్‌గేట్ సమీపంలో బైక్ ఆగిపోవడంతో రోడ్డు పక్కన నిలుపుదల చేసి వెళ్లగా బుల్లెట్ దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు.

రూ.ఐదు లక్షల సొమ్ము మాయం

» భీమవరం పట్టణంలో బైక్ డిక్కీలో పెట్టిన నగదు చోరీ

భీమవరంక్రైం, జూన్ 18 : భీమవరం పట్టణంలోని ఓ బ్యాంకు వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసి తిరిగి వచ్చేసరికి అందులో ఉంచిన ఐదు లక్షల రూపాయలను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన భీమవరం ఒకటో పట్టణంలోని బుధవారం మార్కెట్లో మంగళవారం జరిగింది. పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన చెర్ల రవిశంకర్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంపై మంగళవారం భీమవరం వచ్చారు. తనతో తెచ్చుకున్న ఐదు లక్షల రూపాయలను వాహనం డిక్కీలో ఉంచి బ్యాంకుకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి డిక్కీ తెరిచి ఉండడం అనుమానం వచ్చింది.. తీసి చూస్తే ఐదు లక్షల రూపాయలు కనిపించలేదు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆగని వైసీపీ మూకల దాడులు

దివ్యాంగ టీడీపీ నాయకుడిపై సర్పంచ్ దాడి

» భీమడోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అశోక్



టీడీపీ మండల కార్యదర్శిపై దాడి చేస్తున్న వైసీపీ శ్రేణులు

ద్వారకాతిరుమల, జూన్ 18: వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. దివ్యాంగుడైన టీడీపీ మండల కార్యదర్శిపై పాతకక్షల నేపథ్యంలో గ్రామ వైసీపీ సానుకూల సర్పంచ్, అతడి అనుచరులు మంగళవారం విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన పంగిడిగూడెంలో జరిగింది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన కాలి అశోక్ శారీరకంగా అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. టీడీపీపై ఉన్న అభిమానంతో చురుగ్గా పనిచేయడంవల్ల పార్టీ మండల కార్యదర్శిని చేశారు. 2021 పంచాయతీ ఎన్నికల్లో అతడు గ్రామానికి చెందిన వైసీపీ నేత పత్తిపాటి మహాలక్ష్ముడు అనే యోహానుపై పోటీ చేసి ఓడిపోయాడు. అయినా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో గ్రామంలో టీడీపీకి మంచి మెజారిటీ వచ్చేందుకు కృషి చేశాడు. టీడీపీ విజయానికి కృషి చేయడం, సర్పంచ్‌గా పోటీచేయడాన్ని ఓర్వలేక మంగళవారం పార్టీ కార్యాలయంలో వున్న అశోక్‌ను బయటకు పిలిపించి అతడి అంగవైకల్యాన్ని హేళన చేస్తూ.. దుర్భాషలాడి తన అనుచరులైన గుమ్మడి శ్రీను, గుమ్మడి బుచ్చియ్య, గుమ్మడి దేవయ్యతో కలసి దాడి చేశాడు. దివ్యాంగుడు కావడంతో ఆ మూకను ఎదుర్కోలేక దాడిలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించి చికిత్స అందిస్తున్నారు.

శృంగవృక్షంలో ఫ్లెక్సీల వివాదం



శృంగవృక్షంలో గుర్తుతెలియని వ్యక్తులు చించిన జనసేన ఫ్లెక్సీలు

పాలకోడేరు, జూన్ 18 : శృంగవృక్షం గ్రామంలో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడంతో జనసేన నాయకులు పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో రహదారిని చేర్చి, మరికొన్ని పలు ప్రాంతాల్లో జనసేన నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, స్థానిక నాయకులతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడంతో జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉండి ఎమ్మెల్యే రఘురామకు, పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

బ్యానర్‌ను చించారంటూ పోలీసులకు ఫిర్యాదు

ఉండి, జూన్ 18: ఓ బ్యానర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చించారని.. తన తండ్రిపై గొడవకు వచ్చిన ఇరువురిపై అనుమానం ఉందని రంపా అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. చినపుల్లేరు శివారు తల్లమ్మచెరువుకు చెందిన రంపా అశోక్ తండ్రి పౌలురాజుతో అదే గ్రామానికి చెందిన ఇరువురు నక్కా సంతోష్, మద్దా దీపక్ అనేవారు ఈనెల 2వ తేదీన వచ్చి పాత గొడవ పురస్కరించుకుని ఘర్షణ పడ్డారు. ఈనెల 12వ తేదీన అశోక్ తండ్రి గ్రామంలో కూటమి గెలిచిందని ఫ్లెక్సీ బ్యానర్ కట్టుకున్నారు. దానిని గుర్తుతెలియని వారు చింపివేశారు. గతంలో ఘర్షణకు దిగిన వారే చింపిన వారిపైనే అనుమానం ఉందని పోలీసులకు అశోక్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో కూలీ మృతి

చింతలపూడి, జూన్ 18:చింతలపూడి మండలం గణిజర్ల గ్రామంలో విద్యుదాఘాతంతో మద్దెల సురేష్ (35)అనే కూలీ మృతి చెందాడు. గ్రామంలోని ఒక తోటలో పనికి వెళ్లి విద్యుత్ స్తంభం లేపుతుండగా ఆ స్తంభంపై వున్న విద్యుత్‌తీగలు తగిలి వున్నాయి. అవి చూసుకోకుండా స్తంభాన్ని పట్టుకోవడం వల్ల విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. పనికివెళ్ళి విద్యుదాఘాతానికి గురికావడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, జూన్ 18 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి బిహార్ వాసి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బిహార్‌కు చెందిన సుజన్‌మహల్దార్(24) బిహార్ నుంచి విజయవాడ వెళ్తున్న రైలులో మంగళవారం సాయంత్రం భీమడోలు మండలం పాతూరు రైల్వే గేటు సమీపంలో ప్రమాదవశాత్తు రైలు బోగీ నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావుకు అందడంతో మంగళవారం రాత్రి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతబడి నెపంతో పూజారిపై కత్తితో దాడి

పోలవరం, జూన్ 18 : చేతబడి చేస్తున్నాడనే నెపంతో గుడి పూజారిపై ఓ వ్యక్తి తాటాకు నరికే కత్తితో దాడి చేసి విచక్షణా రహితంగా నరికిన ఘటన పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలవరం ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయ పూజారిగా పనిచేస్తున్న జొన్నాడ పేరాస్వామి చేతబడి చేస్తున్నాడనే నెపంతో గ్రామానికి చెందిన చిక్కాల యేసు కత్తితో పొట్ట, వీపుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన పూజారిని ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. పూజారి భార్య ఎం.లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో తన భర్త పూజారి చేతబడి చేస్తున్నాడని దుష్ప్రచారం చేస్తున్నాడని, అదేమిటని అడిగినందుకు కత్తితో దాడికి పాల్పడినట్టు తెలిపింది. ఈ మేరకు ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కొట్లాటపై కేసు నమోదు

పెదపాడు, జూన్ 18 : సరిహద్దు తగాదా నేపథ్యంలో తనను కొట్టి గాయపర్చారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు. పెదపాడు మండలం గోగుంట గ్రామానికి చెందిన కుందేటి కిరీటం ఏలూరు అవుట్‌పోస్టు పోలీసుకు ఇచ్చిన ఫిర్యాదుతో, వారి సమాచారం మేరకు తానంకి మల్లేశ్వరరావు, రాజేష్‌లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కమ్మేసిన పొగ

స్థానికులు, ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి



ఆకివీడులో చెత్తకు నిప్పు అంటించడంతో కమ్ముకున్న పొగ

ఆకివీడు, జూన్ 18: అనధికార డంపింగ్ యార్డులో చెత్తను అంటించడంతో కమ్ముకుంటున్న పొగతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకివీడు మేజర్ పంచాయతీని నగర పంచాయతీగా గత ప్రభుత్వం చేసింది తప్ప అభివృద్ధి శూన్యం. నేటికీ పూర్తిస్థాయిలో అధికారులను నియమించకపోవడంతో నగర పంచాయతీలో ఇద్దరు అధికారులతోనే పాలన కొనసా గుతుంది. సిద్ధాపురం వైపు వెళ్లే వంతెన దగ్గరలో ఉన్న అనధికార డంపింగ్‌యార్డుకు స్థలం లేకపోవడంతో వేసిన ఎప్పటికప్పుడు తరచూ చెత్తను అంటిస్తున్నారు. అంటించిన సమయంలో వచ్చే పొగతో ఆ ప్రాంతం మీదుగా ధర్మాపురం, సిద్ధాపురం, కళింగగూడెం, రాజులపేట తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులతో పాటు, వ్యాధుల బారిన పడుతున్నారని టీడీపీ రాష్ట్ర రైతు నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని పాలకులు, అధికారులను కోరుతున్నారు.



పాలకోడేరులో విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామ

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలి

పాలకోడేరు/ఆకివీడు/కాళ్ల/ఉండి, జూన్ 18: సొంత ఇంటి మాదిరి పాఠశాలలను అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, చెరుకు వాడల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. విద్యా వ్యవస్థ అత్యున్నత ప్రమాణాలతో ముందుకు సాగాలని కోరారు. ఆర్‌జేడీ జీ.నాగమణి, దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, ఏడుకొండలరాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఎంఈఓలు శివన్నారాయణ, కొత్తపల్లి నాగరాజు, కామన రాంబాబు, మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, గొంట్లా గణపతి, కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణకుమారి, నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, జడ్పీటీసీ యండగండి శ్రీను, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, గాదిరాజు వెంకటకృష్ణంరాజు, సర్పంచ్ కొండవీటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

నియోజకవర్గం అభివృద్ధికి ఆక్వా రైతులు ఎకరానికి వెయ్యి రూపాయలు విరాళం ఇవ్వాలని ఎమ్మెల్యే రఘురామ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో కలెక్టర్‌ను కలసి బ్యాంకు ఖాతాను ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో డ్రెయిన్‌లు, కాల్వల ప్రక్షాళనకు ఎమ్మెల్యే రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. అంతకు ముందు వర్షాకాలంలో ఆకివీడు పట్టణం ముంపుబారిన పడకుండా ప్రధాన మురుగు బోదెలు ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్యే రఘురామ నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ ఆదేశించారు. అలాగే తమ సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ రేషన్ డీలర్లు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులు అభ్యున్నతి సాధించాలి

ఆచంట, జూన్ 18: ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి అభ్యున్నతి సాధించాలని ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి అన్నారు. మంగళవారం కొడమంచిలి హైస్కూలులో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుకూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాలకోడేరు, జూన్ 18: విస్సాకోడేరు గ్రామానికి చెందిన మండా సోమేశ్వరరావు కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకుని హైదరాబాదుకు చెందిన సన్నిది రామలింగేశ్వరరావు, గణపవరంకు చెందిన వంకాయాల ఏడుకొండలు కలిసి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. దాతలను ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి గ్రంధి రాజా, తదితరులు అభినందించారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

భీమవరం అర్బన్, జూన్ 19: కేంద్ర ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తు ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకులు కె.రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. భీమవరం పట్టణంలో సుందరయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో రాజకీయ విజ్ఞాన తరగతులు నిర్వహించారు. గతంలో బీజేపీ ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తు ధరలు తగ్గిస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా పెరిగిన నిత్యావసర ధరలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని లేకుంటే ప్రజలు ఆందోళన చేస్తారని హెచ్చరించారు.



వెంకయ్యవయ్యేరు నుంచి పైపులైన్ల ద్వారా చెరువుకు నీరు నింపుతున్న దృశ్యం

మంచినీటి చెరువులకు నీరు నింపాలి

గణపవరం, జూన్ 18 : గణపవరం మండల గ్రామాల్లోని మంచినీటి చెరువులు అడుగంటడ ంతో స్వచ్ఛమైన తాగు నీరు కొరత ఏర్పడింది. వేసవి ప్రారంభంలోనే చెరువులకు నీరు నింపి నప్పటికీ మండుతున్న ఎం డలతో చెరువు అడుగంట డంతో నీరు బురదమయంగా మారింది. కాల్వలకు నీరువదిలి పదిహేను రోజులు కావస్తున్న గుర్రపుడెక్క వల్ల నీటి ప్రవాహం మందగించి నిల్వ నీరే కాల్వల్లో తాండవిస్తున్నాయి. చెరువులకు నీరునింపేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. గత్యంతరం లేక ఆ నీటినే వినియోగి ంచకోవాల్సి వస్తుంది. వాకపల్లి, వరదరాజపురం, కొత్తపల్లి, ముగ్గళ్ళ, ముప్పర్తి పాడు, కోమర్రు, డీకే.వల్లి, సరిపల్లె గ్రామాల్లో చెరువులు అడుగంటాయి. సరిపల్లె గ్రామ ఆయకట్టులో మాత్రమే ఉపాధి హామీ పథకం కింద కూలీ లతో యుద్ధప్రతిపాదికన వెంకయ్యవయ్యేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగించి పైపులైన్ ద్వారా చెరువుకు నీరు నింపే కార్యక్రమం చేపట్టామని, బ్లీచింగ్ చల్లించామని కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. మండలం లోని మిగిలిన గ్రామాల్లో కూడా కాల్వలోని గుర్రపుడెక్కను పూర్తిగా తొలగి ంచి చెరువుల్లో స్వచ్ఛమైన నీరు నింపుకునేలా అధికారులు చర్యలు చేపట్టా లని ఆయా గ్రామ సర్పంచ్‌లను గ్రామస్థులు కోరుతున్నారు.

ఝాన్సీలక్ష్మీభాయి ఆదర్శనీయురాలు



ఝాన్సీ లక్ష్మీభాయి విగ్రహం వద్ద నివాళులు

మొగల్తూరు, జూన్ 18: వీరనారీ మణి, దేశ రక్షణ కోసం తన ప్రాణాలను బలి దానం చేసి మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచిన ఝాన్సీలక్ష్మీభాయి చిరస్మరణీయురాలని ముత్యాలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెన్మత్స రామరాజు అన్నారు. ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీ భాయి వర్ధంతి సందర్భంగా పాఠశాలలోని ఆమె విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నందమూరుకు ఫిల్టర్ బెడ్ల ఏర్పాటు



ఫిల్టర్ బెడ్‌ల ఏర్పాటుకు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 18: నందమూరులో మైక్రో ఫిల్టర్ బెడ్ల నిర్మాణా నికి మంగళవారం ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శేషగిరిరావు పరిశీలించారు. మంచినీటి కోసం పడుతున్న ఇబ్బందులను ఎన్నికల ప్రచార సమయంలో బొలిశెట్టి శ్రీనివాస్‌కు తెలపగా ఆ మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించడంతో మంగళవారం వారు గ్రామంలో సర్పంచ్ శనగన వరలక్ష్మి, గ్రామ పెద్ద రాముతో చర్చించారు.

ఉద్యోగులపై మంత్రి వ్యాఖ్యలు బాధాకరం

పెనుమంట్ర, జూన్ 18 : రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యవ సాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు సోమవారంనాడు శ్రీకాకుళం జిల్లాలో జరిగిన కార్యకర్తలు సమావేశంలో ఉద్యోగులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు తీవ్రంగా ఖండించారు. మాట వినని ఉద్యోగులను ఏమైనా చేస్తామని మంత్రి మాట్లాడడం బాధాకరమని అన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టండి: కలెక్టర్



మ్యాప్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం టౌన్, జూన్ 18 : జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన ఆయన వరద నియంత్రణలో భాగంగా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. మొదటి ప్రమాద హెచ్చరిక వరకు ఇబ్బందిలేదని, రెండో ప్రమాద హెచ్చరికలో 13 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తే ఏయే ప్రాంతాలు, ఎన్ని కుటుంబాలు ప్రభావితం అవుతాయి, తీసుకోవలసిన ముందస్తు చర్యలపై అధికారులను ఆరా తీశారు. వరద ప్రభావిత ప్రాంతాలైన బాడవ, వైవిలంక, యలమంచిలి లంక, లక్ష్మి పాలెం, కోడేరు లంక తదితర గ్రామాల ప్రజల కోసం ఏయే చర్యలు చేపట్టాల్సి ఉంటుంది అనే సమాచారాన్ని సేకరించాలన్నారు. పెనుగొండ, మొగల్తూరు, ఆచంట, నరసాపురం, యలమంచిలి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో వరద ప్రభావం ఉంటుందని, భద్రాచలం నుంచి విడుదలయ్యే నీటిని అంచనాగా తీసుకుని ముందుగా ఏ మండలాల్లోని ఏయే గ్రామాలలో నీరు చేరవచ్చో ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వరద నియంత్రణకు వినియోగించే సామగ్రి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవుట్ ఫాల్ స్లూయి స్ మరమ్మతులు, ఏటిగట్ల పటిష్ఠతకు అవసరమైన నిధులు మంజూరుకు ప్రతిపాదనలను వెంటనే సమర్పించాల న్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు, భద్రాచలం నుంచి గోదావరికి నీరు చేరుకునే మార్గాలు, చివరగా సముద్రం లో కలిసే ప్రాంతం తదితర వివరాలను మ్యాప్ లను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె. ఉదయ భాస్కరరావు, డ్రెయినేజీ ఈఈ ఎం.వి.వి కిషోర్, హెడ్ వాటర్ వర్క్స్ నరసాపురం ఏఈ కె.వి.సుబ్బారావు, సిద్ధాంతం ఏఈ జీడి పవన్ కుమార్, కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష





మంత్రి నిమ్మలను అభినందిస్తున్న ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం యూనిట్ మేనేజర్ బి.హరిబాబు, మెమెంటో అందిస్తున్న మునిసిపల్ కమిషనర్ విజయసారథి

పాలకొల్లు టౌన్/రూరల్, జూన్ 18 :పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గంలోని ఆయాశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒక్కొక్క శాఖ అధికారితో అయా శాఖల అభివృద్ధి పనులను సమీక్షించారు. రానున్న రోజుల్లో అన్ని శాఖల్లోనూ ప్రజలకు మేలు చేసేలా అధికారులు పనితీరు ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బి.విజయసారధి, అయాశాఖల అధికారులు మంత్రి నిమ్మలకు పుష్పగుచ్చాలు అందచేసి అభినందనలు తెలిపారు. పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామిని మంత్రి డాక్టర్ నిమ్మల మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం సమీపంలోని వ్యాపారులు నిమ్మల విజయం సాధించడంతో ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నిమ్మల రామానాయుడును మంగళవారం ఆయన కార్యాలయంలో పలువురు టీడీపీ నాయకులు కలిసి పుష్పగుచ్చాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమమోహన్, నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చెట్టి చంద్రమౌళి, టీటీ తిరుమలరాజు, శాగా సత్యనారాయణ, అందే కోటీ వీరభద్రరావు, బట్టల వర్తక సంఘం నాయకులు వట్టం గణేష్, శీరం ఆనంద కృష్ణ, సలాది జానీ, బాసిన సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

టీడీపీలోకి పలువురి సర్పంచ్‌లు

సర్పంచ్‌లు మండెల పావన్, సర్పంచ్‌ల చాంబర్స్ అధ్యక్షుడు జి.పెద్దిరాజు, రేపాక నగేష్ కరుణాకర్, మండలపరిషత్ ఫ్లోర్ లీడర్ శాగా సత్యనారాయణ, పలువురు ఎంపీటీసీలు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. మండలానికి చెందిన 27 మంది సర్పంచ్‌ల్లో 12 మంది టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు మంత్రి అనుమతికి వచ్చారు. మంత్రి నిమ్మల అనుమతిస్తే త్వరలో టీడీపీలో చేరనున్నట్టు రేపాక నగేష్ కరుణాకర్ విలేకర్లకు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలపై వినతి

మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును మంగళవారం పాలకొల్లులోని క్యాంప్ కార్యాలయంలో పాలకొల్లు జర్నలిస్టులు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఏపీయుడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి గజపతి వర్షప్రసాద్, కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, పాలకొల్లు ప్రెస్ క్లబ్ సభ్యులు విన్నకోట వెంకట రమణ, ఎంఎస్‌వి సాంబశివరావు తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం బ్రాంచ్ మేనేజర్ బత్తుల హరిబాబు, యాడ్స్ మేనేజర్ రాజు, రిపోర్టర్ ముత్యాల శ్రీనివాస్ మంత్రి నిమ్మలను కలిసి అభినందనలు తెలిపారు.

నీటి కిట్టు.. పరీక్షిస్తే ఒట్టు!

అత్తిలి, జూన్ 18 : ప్రజలకు సురక్షిత నీరు వట్టిమాటే అవుతోంది. కలుషిత నీటితో గ్రామీణులు రోగాలబారిన పడుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో తాగునీటి నాణ్యతా పరీక్షలు అటకెక్కాయి. ప్రతి 14 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, పైపులైన్లు నిత్యం పగిలిపోతుండడంతో తాగునీరు కలుషితమవుతోంది.

పర్యవేక్షణ కొరవడి...

ఒక్కో కిట్టు రూ. 1292 విలువ చేసేవి పంచాయతీలకు రెండున్నరేళ్ళ కిందట అందజేశారు. కిట్టులో నైట్రేట్ రీజంట్ -ఎ రకం 100, నైట్రేట్ రీజంట్ -బి రకం 100, ఫ్లోరైడ్ ఇండికేటర్ 100, సంపూర్ణ కఠినత్వం మందుబిళ్ళలు 100 చొప్పున సరఫరా చేశారు. వాటిని ఎలా వినియోగించాలో గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కిట్లు చాలా చోట్ల వినియోగించలేదు. వాటిలో రసాయనాలు, ఔషధాలు గడువుదాటిపోయాయి. మండలంలోని 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి సచివాలయానికి ఒకటి చొప్పున నీటి పరీక్షా కిట్లను ప్రభుత్వం సరఫరా చేసింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వాటిని నామమాత్రంగా వినియోగించారు. దీనిపై శిక్షణ పొందినా ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతో నీటి కిట్లన్నీ మూలపడ్డాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిబంధనలు ప్రకారం 14 రోజులకు ఒకసారి నీటి కిట్లతో పరీక్షలు జరపాలని కోరుతున్నారు.

నీటి పరీక్షలకు ఉపయోగించే కిట్



హనుమాన్ చాలీసా పారాయణం



పాలకొల్లు అర్బన్, జూన్ 18: కొత్తపేట లోని భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆప్రాంతానికి చెందిన మహిళలు ప్రతీ మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్నారు. గత 9 వారాలుగా హనుమాన్ పారాయణ చేస్తున్నట్టు తెలిపారు. ప్రతీ మంగళవారం సాయంత్రం 6గంటల నుంచి 7.30 వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

రైతుల ధాన్యం బకాయిలు చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రంఅందజేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ, జూన్ 18: రైతులకు రూ.50 కోట్ల ధాన్యం బకాయిలు తక్షణం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో పెనుగొండ తహసీల్దార్ కేవీవీ రోహిణి దేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల సీపీఎం కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతాంగానికి ధాన్యం అమ్మిన డబ్బే ముఖ్యమని రైతు అవసరాలతో ముడిపడి ఉన్న ధాన్యం సొమ్ము, విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు షేక్ పాదుషా, నాగిశెట్టి గంగారావు, శీలం యేసు, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్డీయే విజయంపై పూజలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 18: కూటమి విజయం సాధించడం పట్ల జగన్నాథపురం తెలుగు మహిళలు మాజీ సర్పంచ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ చాలీసా, అష్టోత్తర పూజలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, జనసేన యువ నాయకుడు బొలిశెట్టి రాజేష్ పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నాయకుల గెలుపుపై అభినందనలు

భీమవరం టౌన్, జూన్ 18 : సార్వత్రిక ఎన్నికలలో తూర్పుకాపు కులానికి చెందిన చీపురుపల్లి నియోజకవర్గం నుంచి కిమిడి కళా వెంకట్రావు, పాతపట్నం నియోజకవర్గం నుంచి మామిడి గోవిందరావు, గజపతి నగరం నియోజకవర్గం నుంచి కొండపల్లి శ్రీనివాస్ నాయుడు, విజయనగర ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడు ఎన్నికైన సందర్భంగా భీమవరం పట్టణ తూర్పుకాపు విద్యా విజ్ఞానాభివృద్ధి సంఘం, తూర్పుకాపు విద్యాకమిటీ సభ్యులు జిల్లా గౌరవ అధ్యక్షుడు మెరగాని అప్పారావు, జిల్లా అధ్యక్షుడు సరిపిడకల రామారావు, పట్టణ అధ్యక్షుడు మెరగాని సత్యనారాయణ (బాలు), ముల్లి లక్ష్మీ నరసింహమూర్తి, తాళ్ళపూడి గాంధీ, విద్యా కమిటీ కన్వీనర్ మెరగాని ప్రసాద్ అభినందనలు తెలిపారు. మొదటిసారిగా శాసన సభ్యులుగా విజయం సాధించిన కొండపల్లి శ్రీనివాస్ నాయుడుకి రాష్ట్ర మంత్రివర్గంలో సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఎన్నారై సాధికారిత శాఖ మంత్రిగా స్థానం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సంఘం తరుపున ధన్యవాదాలు తెలిపారు.



పొత్తూరికి సమస్యల్ని విన్నవిస్తున్న లస్కర్లు

జీతాలు ఇప్పించాలని వినతి

నరసాపురం, టౌన్, జూన్ 18: ఇరిగేషన్ కార్యాలయంలో పని చేస్తున్న లస్కర్లు మంగళవారం డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజును కలిసి వారి సమస్యల్ని విన్నవించుకున్నారు. 14 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ఈ ఏడాది ఇంత వరకు విధుల్లోకి తీసుకోలేదని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి రామానాయుడు దృష్టికి తమ సమస్యల్ని తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలన్నారు. అంతకు ముందు కూటమి అధికారంలోకి రావడాన్ని హర్షిస్తూ ఆయనకు బొకే అందించారు. ఈ కార్యక్రమంలో పవన్, రాహుల్, సాయికృష్ణ, రామారావు, రాము, హరిప్రసాద్, జోగేంద్ర, నాగబాలు, సురేంద్ర, బాలు, ప్రసాద్, కొండా పాల్గొన్నారు.

12931 మంది రైతులకు పీఎం కిసాన్

నరసాపురం రూరల్, జూన్ 18: సబ్‌డివిజన్ పరిధిలోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాలకు చెందిన 12931 మంది రైతులకు 17వ విడత పీఎం కిసాన్ పెట్టుబడి సాయం అందినట్టు వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. నరసాపురంలో 6179 మంది, మొగల్తూరులో 2140 మందికి, యలమంచిలి 4612 మందికి సాయం చేసిందన్నారు.

ఉచిత గుండె వైద్య పరీక్షలు

అత్తిలి, జూన్ 18 : అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖరరావు సహకారంతో 55 మందికి గుండె వైద్య పరీక్షలు విజయవాడ వైవీ రావు ఆసుపత్రి వారు నిర్వహించారు. సమస్యలున్న వారిని విజయవాడ రావాలని, అక్కడ ఉచితంగా పరీక్షలు జరుపుతారని తెలిపారు. క్లబ్ కార్యదర్శి సీతాల వెంకటరానాయణ, జోనల్ చైర్మన్ రాంబాబు, మాజీ చైర్మన్ బాబ్జీ, శివ పాల్గొన్నారు.

కమిషనర్‌కు ప్రశంసా పత్రం



తణుకు, జూన్ 18: తణుకు మున్సిపల్ కమిషనర్ బి. వెంకటరమణ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దీనిని అందజేశారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు ప్రోత్సాహకంగా ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. మున్సిపల్ డీఈ కె. ఈశ్వర్ రెడ్డితో పాటు పలువురు ఉద్యోగులు ఆయనను అభినందించారు.

పితానికి మంత్రి పదవి ఇవ్వాలి

పెనుగొండ, జూన్ 18: ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమి గెలుపుకోసం తనవంతు కృషి చేసిన రాజకీయ అపర భగీరథుడు, జిల్లాలోని ప్రజల నాడి తెలిసిన వ్యక్తి పితాని సత్యనారాయణ అని అటువంటి వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వకపోవడం బాధాకరమని తెలుగు యువత అధ్యక్షుడు మండా ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు వేంద్ర రాము అన్నారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పైవిధంగా స్పందించారు.

ముసలమ్మ ఆలయ వార్షికోత్సవం



పెనుగొండ, జూన్ 18: ములపర్రు గ్రామంలో ముసలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ములపర్రు మారెమ్మ గద్దె శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

సింహ వాహనంపై ఊరేగిన శ్రీవారు



ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

అత్తిలి, జూన్ 18: ఈడూరులో వరాల వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా వేదపారాయణం నిర్వహించారు. గ్రామ ప్రముఖులు చేకూరి కృష్ణంరాజు దంపతులు పండిత సత్కారం జరిపారు. సాయంత్రం స్వామివారిని సింహ వాహనంపై ఊరేగించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలు జరిగాయి.

అధినేతను కలసిన గోవిందరావు



భీమవరం టౌన్, జూన్ 18 : జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌ను మంగళవారం నాడు ఉమ్మజిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చిన బాబు) కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారు చర్చించుకున్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నిర్వాహకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భీమవరం టౌన్, జూన్ 18 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని, పురాణకాలం నుంచి యోగ మహర్షులు కూడా చేసే వారని, ప్రస్తుత తరుణంలో మనిషి తినే ఆహారం, వాతావరణ కాలుష్యం అనేక రకాల వత్తిడిలతో జీవిస్తున్నారని, యోగాతోనే సంపూర్ణ పరిష్కార మార్గమని యోగ శిక్షకులు రవి శంకర్ గురూజీ శిష్యులు కలిగొట్ల గోపాలశర్మ అన్నారు. యోగా, ధ్యానంలపై అవగాహన సదస్సు ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని పీఎస్ఎం హైస్కూల్లో నిర్వహించారు. గోపాల శర్మ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగ వ్యాయామంపై అవగాహన కల్పించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, దీని లో భాగంగా ఈ నాలుగు రోజులపాటు అవగాహన కార్యక్రమాలను సదస్సులను ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు. అరసవల్లి సుబ్రమణ్యం, నరహరిశెట్టి కృష్ణ, హైస్కూల్ హెచ్ ఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు రామోజీరావు స్ఫూర్తి

భీమవరం టౌన్, జూన్ 18 : విద్య, వైజ్ఞానిక, కళా, క్రీడా, సామాజిక సేవా దాతృత్వాలకు పాత్రికేయ దిగ్గజం రామోజీరావు స్ఫూర్తి అని లూథరన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మణి రాజ్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో లూథరన్ హైస్కూల్లో రామోజీరావు సంతాప సభ, బాలలను బడిలో చేర్పించాలని సదస్సు విద్యార్థులకు బుక్స్‌ను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు మణి రాజ్ మాట్లాడుతూ పాత్రికేయ రంగానికి దిశా నిర్దేశాలతో రామోజీరావు అన్ని వర్గాల వారికి స్ఫూర్తినిచ్చారని అన్నారు. 6వ తరగతిలో చేరిన 27 మందికి, మొత్తం 40 మంది ఇతర తరగతి విద్యార్థులకు నరహరిశెట్టి కృష్ణ, గోపీకృష్ణ మురళీకృష్ణ సహకారంతో నోట్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ అసిస్టెంట్ శ్యామల రాజు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, జూన్ 18: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు సంయుక్తంగా నిర్వహించే వృద్ధులకు ఉచిత వైద్య సేవలు మంగళవారం సంఘ కార్యాలయం నిర్వహించారు. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు 24 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ఇవటూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

దోమల్ని నిర్మూలించాలి

తణుకు, జూన్ 18: ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని అర్బన్ పీహెచ్‌సీ, ఎన్జీవో కాలనీ, టి.వేమవరంలో మలేరియా నివారణ మాసోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సత్యవతి

తణుకు, జూన్ 18: ఈ నెల 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని నాల్గో అదనపు జిల్లా న్యాయాధికారి డి.సత్యవతి అన్నారు. మంగళవారం కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆయా స్టేషన్ల పరిధిలో పరిష్కరించతగిన ఎక్కువ కేసులు పరిష్కరించాలన్నారు. న్యాయాధికారులు కృష్ణ సత్యలత, పొతర్లంక శ్రీరామ్, రంజిత్‌కుమార్, ఏపీ నాగరాజు, చిరంజీవిరావు, తాడి ఆంజనేయులు, ఏపీఈపీ హనుమంతరావు పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్రమంతా అన్న క్యాంటీన్లు: వలవల



తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 18: త్వరలోనే అన్న క్యాంటీన్లు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమవుతాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. మంగళవారం పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలోని అన్న క్యాంటీన్ వద్ద బాబ్జి సహకారంతో అన్నసమారాధన జరిగింది. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ వైసీపీ అన్న క్యాంటీన్లు మూసివేసినా ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా ఇప్పటివరకు అన్న సమారాధన చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు అన్నక్యాంటీన్లు పునఃప్రారంభిస్తామంటూ సంతకం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, వాడపల్లి సుబ్బరాజు, ఎరుబండి సతీష్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, జూన్ 18: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 20న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యనిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు వైద్యులు ఉచితంగా పరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి అన్ని రకాల రక్తపరీక్షలు, ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

వీరవాసరం(భీమవరంటౌన్) : గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లుగా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవానీ హెచ్చరించారు. మంగళవారం నాడు ఎంపీపీ కార్యాలయంలో ఎన్ఆర్‌జీఎస్ అధికారులతో పనులపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి పనిదినాలు పెంచే విధంగా చూస్తామని అన్నారు.